

**అన్నదాతలకు అండగా..**
వరికి మద్దతు ధరపై క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో 2లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.
10లో




**కులవృత్తిదారుల సంక్షేమానికే..**
కులవృత్తిదారుల సంక్షేమం కోసమే విశ్వకర్మ యోజన పథకాన్ని అమలుచేస్తున్నట్లు వివిధ శాఖల అధికారులు వెల్లడించారు.
8లో

గరిష్ఠం / కనిష్ఠం 36° / 20°

**వాతావరణం**
జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నం వరకు ఎండ పెరిగి ఆతర్వాత తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహించే బెస్ట్ అవైలబుల్ పథకంలో 2024–25 విద్యాసంవత్సరానికి కొత్త పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి ఉన్న గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో 7నుండి 10వ తరగతి వరకు 90శాతం కంటే ఎక్కువ ఫలితాలు, 50 శాతం కంటే ఎక్కువ మొదటి తరగతి ఉత్తీర్ణత నమోదైన పాఠశాలలకు అర్హత ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న యజమాన్యాలు ఈనెల 20వ తేదీలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

### డయల్ 100కు 3,463 ఫోన్లు

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల సమస్యలపై తక్షణమే స్పందించేలా ఏర్పాటుచేసిన డయల్ 100కు జనవరి నెలలో 3,463 మంది ఫోన్ చేశారని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో 109 ఫోన్లకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు. వీటిలో హత్యాయత్నం, మహిళలపై వేధింపులు, దొంగతనాలు, ప్రమాదాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని తెలిపారు.

### గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ.మహమూదీ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

### 12న అప్రెంటిస్‌షిప్ మేళా

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా(పీఎంఎన్‌ఏఎం)ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఎంఎన్‌సీ కంపెనీతే కాక స్థానిక కంపెనీల బాధ్యులు కూడా ఈ మేళాకు హాజరవుతారని పేర్కొన్నారు. ఈమేరకు ఐటీఐ అన్ని ట్రేడ్లలో ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు www.apprenticeshipindia.gov.in.gov.in ద్వారా పేర్లు నమోదు చేసుకుని దరఖాస్తు ప్రింట్‌తో పాటు పదో తరగతి, ఐటీఐ మెమోలు, కుల,ఆదాయ సర్టిఫికెట్లు, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

### అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



పాలేరులో వరి పైరును పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

నేలకొండపల్లి/కూసుమంచి: రైతులకు కావాల్సిన ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల హెచ్చరించారు. నేలకొండపల్లి, మంగాపురం, నాచేపల్లిలోని ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల గోదాంలను తనిఖీ చేసిన ఆమె ఎరువుల రికార్డులు పరిశీలించి మాట్లాడారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ నిర్ణీత ధరలకే విక్రయించాలని సూచించారు. ఆతర్వాత కూసుమంచి మండలంలోని పాలేరులో పర్యటించిన డీఏఓ పంటలను ఆశిస్తున్న తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే, పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో ఏఓ అరుణకుమారి, ఏఈఓలు రవితేజ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ‘సీతారామ’ భూసేకరణకు గ్రామసభలు

ఏన్కూరు: ఏన్కూరు మండలంలోని తూతక లింగన్నపేట, ఏన్కూరు, నాచారం గ్రామాల్లో సీతారామ ప్రాజెక్టు భూసేకరణకు గాను బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత మేర, ఎక్కడెక్కడ భూమి అవసరమవుతుందో వెల్లడించారు. ఈ భూమికి గాను రైతులకు పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. సభల్లో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ వేణుమాధవ్, డీఈ చంద్రశేఖర్, ఆర్‌ఐ కార్తీక్ పాల్గొన్నారు.

**ఓటు నమోదుపై ఆసక్తి చూపని గ్రాడ్యుయేట్లు**
- మరోపక్క దృష్టి సారించని పార్టీల నేతలు
- ఈనెల 6వరకు 83,933 మంది దరఖాస్తు
- గత ఎన్నికల సమయాన 87,172 మంది ఓటర్లు



# అంతగా.. పట్టులేదు!

త్వరలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగనుండగా, జిల్లాలో ఆశించిన స్థాయిలో ఓట్లు నమోదు కాలేదు. ఈసారి పట్టభద్రులు పెద్దగా ఆసక్తి కనబర్చకపోవడంతోనే ఇలా జరిగిందని తెలుస్తోంది. జిల్లాలో ఈనెల 6వ తేదీ వరకు 83,933 మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోగా, వీటి పరిశీలన జరుగుతోంది. 2021 ఎన్నికలతో పోలిస్తే ఈసారి తక్కువగా ఉండడం గమనార్హం. కలెక్టర్ గౌతమ్ పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించినా.. జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టినా అనుకున్న స్థాయిలో ఓటర్లు ముందుకు రాలేదు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

**డిసెంబర్ 30న ప్రకటన**
వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి 2021లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పల్లా రాజేశ్వరరెడ్డి గెలిచారు. ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి గెలుపొందగా ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయింది. దీంతో ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఓటరు నమోదు చేపట్టింది. ఈమేరకు డిసెంబర్ 30న ప్రకటన విడుదల చేసి ఆన్‌లైన్‌తో పాటు నేరుగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు.

**83,933 దరఖాస్తులు..**
జిల్లాలో ఈనెల 6వ తేదీ నాటికి 83,933 మంది గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేశారు. ఇందులో ఆన్‌లైన్ ద్వారా 80,356, నేరుగా 3,577 దరఖాస్తులు అందాయి. ఖమ్మం అర్బన్ మండలంలో అత్యధికంగా 27,125 మంది... ఆ తర్వాత ఖమ్మం రూరల్ నుంచి 6,802 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, 2021లో ఖమ్మం అర్బన్ మండలంలో 32,730 మంది ఓటు హక్కు పొందగా, ఈసారి ఆ సంఖ్య 5వేలకు పైగా తగ్గింది. మరోపక్క ఖమ్మంరూరల్ మండలంలో మాత్రం పెరిగింది. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 19,092,. నేరుగా వచ్చిన వాటిల్లో 161 దరఖాస్తులను ఇప్పటివరకు ఆమోదించగా, మిగతా వాటి పరిశీలన కొనసాగుతోంది. కాగా, ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితా వెల్లడిస్తారు.

**పట్టించుకోని పార్టీలు..**
పట్టభద్రులతో ఓటర్లుగా దరఖాస్తు చేయించే విషయంలో ఈసారి రాజకీయ పార్టీల నాయకులు అంతగా పట్టించుకోలేదు. దీంతో దరఖాస్తుల నమోదు శాతం తగ్గినట్లు తెలుస్తోంది. 2021 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీల నాయకులు గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించారు. కానీ ఈసారి ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. అయితే, ఏ పార్టీ కూడా అభ్యర్థులపై స్పష్టత ఇవ్వకపోవడంతో నాయకులెవరూ పట్టించుకోలేదని తెలుస్తోంది.

**గతం కన్నా తక్కువే..**
2021 ఎన్నికల సందర్భంగా 87,172 మంది పట్టభద్రులు ఓటు హక్కు పొందారు. ఈసారి మాత్రం 83,933 మందే దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో తిరస్కరించే దరఖాస్తులు పోగా ఎందరికి ఓటు హక్కు దక్కుతుందన్నది ఏప్రిల్‌లో తేలనుంది.

**గత, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులు**

| మండలం | 2021 | 2024 |
|---|---|---|
| ఖమ్మంఅర్బన్ | 32,730 | 27,125 |
| ఖమ్మంరూరల్ | 5,053 | 6,802 |
| సత్తుపల్లి | 5,144 | 4,584 |
| కల్లూరు | 3,171 | 3,693 |
| మధిర | 4,407 | 3,422 |
| నేలకొండపల్లి | 2,824 | 3,098 |
| సింగరేణి | 2,933 | 3,039 |
| కూసుమంచి | 2,775 | 2,990 |
| కామేపల్లి | 1,920 | 2,092 |
| వైరా | 3,092 | 2,845 |
| తల్లాడ | 2,490 | 2,643 |
| కొణిజర్ల | 2,510 | 2,484 |
| తిరుమలాయపాలెం | 2,085 | 2,455 |
| పెనుబల్లి | 2,232 | 2,414 |
| రఘునాథపాలెం | 2,024 | 2,263 |
| వేంసూరు | 2,151 | 2,257 |
| ముదిగొండ | 2,407 | 2,236 |
| చింతకాని | 1,829 | 1,978 |
| బోనకల్ | 1,971 | 1,962 |
| ఎర్రుపాలెం | 1,871 | 1,899 |
| ఏన్కూరు | 1,553 | 1,652 |
| మొత్తం | 87,172 | 83,933 |

గతంలో ఓటుహక్కు కలిగిన పట్టభద్రులు సైతం ఈసారి దరఖాస్తుకు ఉత్సాహం చూపకపోవడంతో అధికారులు తీసుకున్న చర్యలు ఫలించలేదు.

## కలెక్టరేట్‌కు కొత్త బోర్డు!




రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం సమీపాన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్)ను నిర్మించగా 34శాఖలు ఇక్కడే కొలువుదీరాయి. ఈ కార్యాలయానికి ఐడీఓసీగా బోర్డు ఏర్పాటుచేసినా అటు అధికారులు, ఇటు ప్రజలు కొత్త కలెక్టరేట్‌గానే పిలుస్తున్నారు. దీంతో తాజాగా కార్యాలయ ముఖద్వారం వద్ద ‘జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం’ పేరుతో భారీ బోర్డు ఏర్పాటుచేశారు. ఏళ్లుగా కలెక్టరేట్‌గానే పిలవడం అందరికీ అలవాటు కావడం ఒక కారణమైతే... రెవెన్యూకు పట్టుగొమ్మ కలెక్టరేటే కావటంతో ఈ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. - ఖమ్మం సహకారనగర్

## వైరాలో ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్



అధికారులతో సమీక్షిస్తున్న మల్లు భట్టి విక్రమార్క

- అవసరమైన భూమి సేకరించండి
- శివరాత్రిలోగా లక్ష్మీపురంలో స్నానఘట్టాల నిర్మాణం
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని సేకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలలు నిర్మించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ సీఎం తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురానికి బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. వైరాలో 100 పడకల ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాలు సేకరించాలన్నారు. వైరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ 4.80 కోట్లు మంజూరు కానుండగా.. చేపట్టాల్సిన పనులపై ఇరిగేషన్ ఈఈ బాబూరావు, డీఈ శ్రీనివాసరావుతో ఆరా తీశారు. కాగా, మహాశివరాత్రి సందర్భంగా స్నానాల లక్ష్మీపురంలో జరిగే శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర సమయానికి వైరా నదిలో స్నానఘట్టాల నిర్మాణం పూర్తి చేయాలని భట్టి ఆదేశించారు. ఇంకా వర్షాకాలంలో వరద వస్తే లక్ష్మీపురంలోని పొలాల్లోకి నీరు చేరకుండా కరకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కాగా, వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల మరమ్మతు, అభివృద్ధి కోసం రూ 87.80 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించగా పరిశీలిస్తానని ఆయన తెలిపారు. ఇంకా స్నానాల లక్ష్మీపురం నుండి గండగలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ ప్లాన్‌ను మార్చి తల్లాడ రోడ్డుకు కలపాలని, గన్నవరం నుండి రాపల్లె, బ్రాహ్మణపల్లి వరకు లింకు రోడ్లు, శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, స్నానాల లక్ష్మీపురం – గండగలపాడు మధ్య డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆయన వెంట వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్ చక్రవర్తి, పీఆర్ డీఈలు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ అధికారి సమత, వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఏఈ విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, దొడ్డా పుల్లయ్య, శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తీర్థాల భక్తులకు ఇబ్బందులు రావొద్దు..

- జాతరకు ఏర్పాట్లు ప్రారంభించండి
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్, తదితరులు

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాలలో వచ్చేనెల 7నుండి జరగనున్న సంగమేశ్వరస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించాలని తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి ఐదు లక్షల మంది భక్తులు వస్తారని తెలిపారు. ఈమేరకు తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలని, రఘునాథపాలెం, కామంచికల్ వైపు నుండి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా రహదారి మరమ్మతు చేయాలన్నారు. కాగా, భక్తుల రద్దీ పెరగనున్నందున ఆర్టీసీ నుంచి సరిపడా బస్సులు నడపాలని తెలిపారు. ఆలయం చుట్టూ ఫెన్సింగ్, తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి రూ.30లక్షలు విడుదల చేస్తామని పొంగులేటి తెలిపారు.

**ఆక్రమణదారులను ఉపేక్షించేది లేదు.**
ఆలయ భూముల్లో సెంట్ ఆక్రమించినా.. వారిని వదిలేది లేదని మంత్రి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పల్లెగూడెం నుండి మంగళగూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మించనున్నందున ఇళ్లు కోల్పోయే వారికి చెల్లించాల్సిన పరిహారం జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. తొలుత తీర్థాలలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానా, ఆరెకోడు తండా, గుదిమళ్లలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం పెదవెంకటగిరి ఉన్నత పాఠశాలను సందర్శించిన మంత్రి అక్కడి సౌకర్యాలు, బోధనపై ఆరాతీశారు. ఈసమావేశాల్లో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాములునాయక్, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కె.శ్రీరామ్, డీఈఓ సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, పీఆర్ ఈఈ పాండురంగవిఠల్, ఎంపీపీ బెల్లం ఉమ, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో పాటే ధర

**సరుకుతో పాటే ధర పైపైకి...**
- నాణ్యమైన మిర్చి వస్తుండడంతో మెరుగవుతున్న ధర
- మిర్చి క్వింటాకు రూ.22,300
- వారం వ్యవధిలో రూ.వెయ్యి పెరుగుదల
- ఖమ్మం మార్కెట్‌లో 70 వేలు బస్తాలు దాటిన విక్రయాలు



ఖమ్మం మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: సాధారణంగా పంట విక్రయాలు పెరిగితే ధర డిమాండ్ తగ్గుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వ్యవసాయ మార్కెట్లతో పాటు ఖమ్మం మార్కెట్‌లోనూ ఇది సహజమే. కానీ ఇప్పుడు మిర్చి కొనుగోళ్లలో భిన్నమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. పంట విక్రయాలు పెరుగుతున్న కొద్ది ధర పెరుగుతుండగా.. నాణ్యత బాగుండడంతోనే మంచి ధర వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మం మార్కెట్‌కు సోమ, మంగళవారాల్లో 50వేల నుంచి 55వేల వరకు మిర్చి బస్తాలు రాగా, బుధవారం 70 వేలకు పైగా బస్తాల మిర్చి తీసుకొచ్చారు. ఇవేకాక తాలు మిర్చి మరో 10వేల బస్తాలు వచ్చినట్లు అంచనా. ఇక సరుకు భారీగా రావడంతో ధర విషయమై రైతులు ఆందోళన చెందినా.. ఇన్నాళ్లతో పోలిస్తే మంచి ధరే దక్కడంతో సంతృప్తి చెందారు. మంగళవారం ‘తేజా’ మిర్చి జెండాపాట ధర రూ.21,950లు పలకగా.. బుధవారం రూ.22,300కు చేరింది. అంటే రోజు వ్యవధిలోనే రూ.350 ధర పెరగగా భారీగా మిర్చి వచ్చినా కొనుగోళ్లు సాఫీగా సాగాయి.

**మార్కెట్‌కు నాణ్యమైన పంట**
డిసెంబర్ చివరి వారంలో మిర్చి కోతలు మొదలుకాగా, జనవరి వరకు తొలికోత పంట వచ్చింది. అయితే, ఈ పంట నాణ్యతగా లేకపోవడంతో కొనేందుకు వ్యాపారులు ఆసక్తి కనబర్చలేదు. ఫలితంగా పంటకు డిమాండ్ ఉన్నా జనవరిలో మిర్చి క్వింటాకు ధర రూ.20వేల నుంచి రూ.21వేల మధ్యే పలికింది. జనవరి చివరి వారం నుంచి రెండో కోత పంట వస్తుండడం, ఇది రంగు, నాణ్యతలో మెరుగ్గా ఉండడంతో రోజురోజుకు ధర పెరుగుతోంది.

**కొనుగోళ్లకు వ్యాపారుల ఆసక్తి**
మొదటి కోత మిర్చి కొనుగోళ్లకు ఆసక్తి చూపని రైతులు ఇప్పుడు మాత్రం ముందుకొస్తున్నారు. రెండో కోత పంట నాణ్యతగా ఉండడం.. విదేశీ ఆర్డర్లు పుంజుకోవటం, దేశీయంగా కూడా డిమాండ్ పెరగటంతో వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఈ ఏడాది తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులతో మిర్చి దిగుబడి తగ్గిన నేపథ్యాన డిమాండ్ పెరుగుతుందనే అంచనాలతో మెరుగైన ధర చెల్లించేందుకు వెనుకాడడం లేదు. గత ఏడాది ఓ దశలో మిర్చి ధర క్వింటాకు రూ.25వేలు పలకగా.. ఈసారి కూడా అదే ధర వస్తుందనే భావన వ్యక్తమవుతోంది.

**ప్రస్తుత సీజన్‌లో మిర్చి ధరలు**

| నెల | తేదీ | ధర (రూ.ల్లో) |
|---|---|---|
| జనవరి | 02 | 23,600 (నిల్వమిర్చి) |
| జనవరి | 08 | 21,000 (కొత్త మిర్చి) |
| జనవరి | 10 | 20,100 |
| జనవరి | 20 | 20,500 |
| జనవరి | 25 | 21,000 |
| జనవరి | 30 | 21,500 |
| ఫిబ్రవరి | 01 | 21,300 |
| ఫిబ్రవరి | 02 | 21,600 |
| ఫిబ్రవరి | 06 | 21,950 |
| ఫిబ్రవరి | 07 | 22,300 |

## కృష్ణా జలాలపై కేంద్రానికి పెత్తనం ఇవ్వొద్దు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ది హామీలు నిలబెట్టుకోలేని చరిత్ర
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కృష్ణా, గోదావరి జలాల విషయంలో శాస్త్రీయ పరిష్కారానికి ఆలోచన చేయాలే తప్ప కేంద్రానికి పెత్తనం అప్పగించొద్దని.. అదే జరిగితే రాష్ట్రానికి తీవ్ర నష్టమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదో ఒక కొర్రీ సృష్టిస్తూ కేంద్రంలోని బీజేపీ రాష్ట్రాల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని.. తద్వారా ప్రతిపక్షాలు లేకుండా చేయాలన్నదే బీజేపీ కుట్ర అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలిచేసి ఏకపక్ష పరిపాలన కోసమే ‘ఒకే దేశం.. ఒకే ఎన్నిక’పై కేంద్రం రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటుచేసిందన్నారు. కాగా, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని చరిత్ర కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలదని తమ్మినేని తెలిపారు. రాష్ట్రాలు విడిపోయినా.. తెలుగు ప్రజలు అంతా ఒక్కటేనని ఆయన చెప్పారు. అయితే, రాష్ట్ర విభజన జరిగి ఏళ్లు గడుస్తుండగా.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాళేశ్వరానికి జాతీయ హోదా వంటి హామీలేవీ నెరవేరకున్నా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఐక్యంగా పోరాడకుండా ఓట్ల కోసం తగువు పడితే తెలంగాణ ప్రజలకు నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలుతుందని బీఆర్‌ఎస్ శాపనార్థాలు పెట్టడం సరైందికాదన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అభివృద్ధి చేసినా ఉద్యమాలు, హక్కుల విషయాల్లో అణిచివేయడం, ఏకపక్ష నిర్ణయాలతో ప్రతిపక్షాలపై అహంకార పూరితంగా ప్రవర్తించిందని తమ్మినేని చెప్పారు. కాగా, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు తెలుపుతోందన్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామని వీరభద్రం తెలిపారు. కాగా, పాలేరు పాత కాల్వ కింద 6వేల ఎకరాల్లో వరి, 1,227 ఎకరాల్లో చెరుకు సాగు చేసినందున నీరు విడుదల చేయించే బాధ్యత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుపై ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, సాయిబాబా, ఎర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, భూక్య వీరభద్రం, బండి రమేష్, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేకాధికారులకు సవాల్

- జీపీల బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- చాలామంది గ్రామపాలనతో సంబంధం లేని శాఖల అధికారులే..
- పలువురికి ఇప్పటికే పర్యవేక్షణ భారం
- మళ్లీ స్పెషల్‌ ఆఫీసర్‌ బాధ్యతలతో సతమతం


పల్లె పాలనపై శిక్షణకు హాజరైన ప్రత్యేకాధికారులు (ఫైల్‌)

**చుంచుపల్లి:** ఓ మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) ఇప్పటికే మండలంలోని 18 గ్రామపంచాయతీలను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఈనెల 2 నుంచి ప్రత్యేక పాలనను తీసుకొచ్చింది. దీంతో సదరు అధికారికి మూడు పంచాయతీల బాధ్యతలు కేటాయించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్న ఆయన మళ్లీ మూడు పంచాయతీల బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. ఇలా ప్రత్యేక అధికారులుగా నియమితులైన ప్రతీ అధికారికి రెండు చోట్ల బాధ్యతలు నిర్వర్తించడం సవాల్‌గానే మారిందని చెబుతున్నారు.

**రెండు నుంచి మూడు జీపీలు**

గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ఇటీవల ముగియగా.. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఉమ్మడి జిల్లాలోని 1,070 గ్రామపంచాయతీలకు గాను మొత్తంగా 396 మంది గెజిటెడ్‌ అధికారులకు స్పెషలాఫీసర్లుగా బాధ్యతలు కేటాయించారు. భద్రాద్రి జిల్లాలో 481 గ్రామపంచాయతీలకు 218 మంది, ఖమ్మం జిల్లాలో 589 గ్రామాలకు 178 మంది అధికారులను నియమించారు. వీరిలో ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగు పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించారు. అయితే, ఈ అధికారులందరూ వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలకమైన అధికారులే. దీంతో అటు మాతృశాఖ, ఇటు పంచాయతీల విధులు నిర్వర్తిస్తూ సమన్వయం చేయాల్సి ఉంటుంది. కానీ శాఖాపరమైన పనులతో ఒత్తిడి ఎదుర్కొంటున్న వీరికి పంచాయతీల అదనపు బాధ్యతలు అప్పగించడంపై ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

**పల్లె పాలనతో సంబంధం లేని శాఖలు**

ప్రభుత్వం గతంలో మాదిరి పంచాయతీరాజ్‌శాఖ నుంచే కాకుండా ఇతర శాఖల అధికారులను సైతం గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులుగా నియమించింది. గ్రామపాలనకు సంబంధం లేని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీ రాజ్‌, మిషన్‌ భగీరథ, ఆర్‌అండ్‌బీ, జలవనరుల శాఖ, మున్సిపల్‌, వ్యవసాయం, వైద్య ఆరోగ్యం, ఉద్యానవన, పశుసంవర్థక, విద్యాశాఖ తదితర శాఖల అధికారులు ఇందులో ఉన్నారు. అనుభవం లేని అధికారులు ఈ బాధ్యతలను నిర్వహించాలంటే కొంత సవాలేనని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్‌ చట్టంలో మార్పులు చేశాక పంచాయతీల బాధ్యతలు మరింతగా పెరిగాయి. దీని ప్రకారం ప్రజలకు మెరుగైన పాలన అందాలంటే క్రమం తప్పకుండా గ్రామపంచాయతీని సందర్శించి రోజువారీ పనులను పర్యవేక్షించాలి. అలాంటప్పుడు మాతృశాఖలో విధులు నిర్వర్తించడం ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈనేపథ్యాన మంగళవారం భద్రాద్రి, ఖమ్మం కలెక్టరేట్లలో పల్లె పాలన, బాధ్యతలపై స్పెషలాఫీసర్లకు శిక్షణ నిర్వహించి కొంత మేర అవగాహన కల్పించారు.

**అనేక బాధ్యతలు**

జీపీల ప్రత్యేకాధికారులు రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా పల్లెల్లో పచ్చదనాన్ని పెంచడానికి నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటించి సంరక్షించటం, ఉపాధి పనులు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి. అలాగే, గ్రామాల్లో సీజనల్‌ వ్యాధుల కట్టడి, సిబ్బందికి జీత భత్యాలు, పన్నుల వసూళ్లు, విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వంటివి కీలకంగా ఉంటాయి. పలు ఇతర శాఖల్లో పనిచేస్తూ ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారు ప్రజా సమస్యల పరిష్కారంలో ఏ మేరకు విజయవంతం అవుతారో తేలాలంటే కొన్నిరోజులు వేచిచూడాల్సిందే.

## పేదల సంక్షేమానికి ప్రధాని కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌ గనాతే

**ఖమ్మం మామిళ్లగూడెం:** పేదల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్‌ గనాతే తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులకు ఎలాంటి ష్యూరిటీ సమర్పించకుండానే చేతివృత్తుల వారికి ఆదుకునేందుకు విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కేంద్రం ఇచ్చే శిక్షణలో పాల్గొనాలని, ఆతర్వాత రూ.15వేల విలువైన కిట్‌ అందుతుందని చెప్పారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు దేవకి వాసుదేవరావు, శ్యాంరాథోడ్‌, మంద సరస్వతి, విజయరెడ్డి, వీరూగౌడ్‌, జ్వాలా నర్సింహారావు, ఉపేందర్‌గౌడ్‌, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి


మల్టీ డిపార్ట్‌మెంట్‌ సమావేశంలో పాల్గొన్న అధికారులు

**సత్తుపల్లిరూరల్‌:** రక్షణ చర్యలు పాటిస్తూనే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని మల్టీ డిపార్ట్‌మెంట్‌ బృందం సభ్యులు సూచించారు. మండలంలోని కిష్టారం ఓపెన్‌ కాస్టును బుధవారం సందర్శించిన బృందం బొగ్గు ఉత్పత్తి, రవాణా తదితర అంశాలపై సమీక్షించారు. ఉద్యోగులు, కార్మికులు సమర్థవంతంగా పని చేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కొత్తగూడెం ఏరియాలోని కిష్టారం ఓసీ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాన్ని 83 రోజులు ముందుగానే సాధించడంపై అభినందించారు. ఈసమావేశంలో అధికారులు కోటిరెడ్డి, కేహెచ్‌.సుమలత, యోహాన్‌, శివకేశవరావు, నర్సింహారావు, రమణారావు, రామకృష్ణ, గోపి, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలి


గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

**చింతకాని:** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగపడేలా ప్రజలు సహకరించాలని.. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు సూచించారు. గ్రామపంచాయతీల్లో స్పెషల్‌ డ్రైవ్‌ బుధవారం మొదలుకాగా, చింతకాని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో సీఈఓ మాట్లాడారు. గ్రామస్తులు వ్యక్తిగతంగానే కాక పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వారం పాటు నిర్వహించే స్పెషల్‌ డ్రైవ్‌లో రహదారులు, ప్రభుత్వ భవనాలను శుభ్రం చేయడమే కాక నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మేకనబోయిన రాంబాబు, డాక్టర్‌ రామ్‌జీ, అనురాధ, రజిత, షేక్‌ సైదులు, కిలారు మనోహర్‌బాబు, వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 10, 11 తేదీల్లో ప్ర.ర.వే. మహాసభలు

**ఖమ్మంగాంధీచౌక్‌:** ఖమ్మంలో ఈనెల 10, 11వ తేదీల్లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) ఏడో మహాసభలను నిర్వహిస్తున్నట్లు కాత్యాయినీ విద్మహే, కేఎన్‌.మల్లీశ్వరి, రవిమారుత్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని 'వేదిక' ఫంక్షన్‌ హాల్‌లో 'స్త్రీలపై ట్రోలింగ్‌' అంశంపై మహాసభలను నిర్వహిస్తుండగా, తొలిరోజు నారాయణ వేణు ప్రసంగిస్తారన్నారు. అలాగే, ట్రోల్‌, నారి సారించిన నవల పుస్తకాల ఆవిష్కరణ, వివిధ అంశాలపై ప్రముఖ రచయిత ఓల్గా తదితరుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. ఈమేరకు విజయవంతం చేయాలని కోరారు.

### నారాయణపురంలో మంత్రి పర్యటన


రిసెప్షన్‌ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పొంగులేటి

**కల్లూరు:** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం తన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో పర్యటించారు. ఈనెల 18న శ్రీనివాసరెడ్డి సోదరుడైన ప్రసాదరెడ్డి కుమారుడు లోహిత్‌రెడ్డి రిసెప్షన్‌ ఇక్కడ జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లను మంత్రి శ్రీనివాసరెడ్డి – మాధురి దంపతులు పరిశీలించారు. కాగా, లోహిత్‌రెడ్డి రిసెప్షన్‌కు కాంగ్రెస్‌ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరుకావాలని వారు కోరారు.

### పాలేరు రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదల


చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎంపీపీ

**కూసుమంచి:** మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో ప్రభుత్వం సమకూర్చిన చేపపిల్లలను ఎంపీపీ బానోత్‌ శ్రీనివాస్‌ నాయక్‌, ఎంపీడీ రమాదేవి బుధవారం విడుదల చేశారు. మత్స్యశాఖ ఆధ్వర్యాన 44 వేల చేప పిల్లలను వదిలిన అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇస్లావత్‌ ఉపేందర్‌, దేశబోయిన ఏడుకొండలుతో పాటు జూకూరి గోపాలరావు, మాదాసు ఉపేందర్‌, చాట్ల పరశురాం పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడు అవమానించాడని విద్యార్థి మనస్తాపం

**నేలకొండపల్లి:** స్నేహితుల ఎదుట ఉపాధ్యాయుడు అవమానించాడని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకోగా తల్లిదండ్రులు అడ్డుకున్నారు. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థి హోంవర్క్‌ రాయలేదని, ప్రతీరోజు పాఠశాలకు రావడం లేదని రెండు రోజుల క్రితం ప్రార్థన సమయంలో ఉపాధ్యాయుడు మందలించి ప్రార్థనలో ఉండకూడదని పంపించాడు. దీంతో సదరు విద్యార్థి కలుపు మందు తాగుతానని మంగళవారం డబ్బా తీసుకుని వెళ్తుండగా స్నేహితులు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు అడ్డుకున్నారు. కాగా, విద్యార్థులు తప్పు చేస్తే సరిదిద్దాల్సింది పోయి ఇలా చేయడం సరికాదని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**కల్లూరు:** మండలంలోని లక్ష్మాతండాలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బానోత్‌ భాస్కర్‌ కుటుంబంతో సహా ఈనెల 4న ఖమ్మంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే, వీరి ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు భాస్కర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన చేరుకుని పరిశీలించగా బీరువా తాళం పగులగొట్టి రూ.25 వేల నగదు, రూ.95 వేల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని గుర్తించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుపోలీసులు తెలిపారు.

### కల్లంలో ఆరబోసిన మిర్చి చోరీ

**వైరారూరల్‌:** ఓ రైతు కల్లంలో ఆరబోసిన ఆరబోసిన ఏడు క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని విప్పలమడకకు చెందిన రైతు చెరుకూరి కృష్ణారావు నాలుగు ఎకరాల్లో సాగుచేసిన మిర్చి కోయిస్తుండగా పొలం వద్దే కల్లం ఏర్పాటుచేసి ఆరబోశాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా సుమారు రూ.1.50లక్షల విలువైన ఏడు క్వింటాళ్ల మిర్చిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



### పామాయిల్‌ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.12,595 |

## కులవృత్తిదారుల సంక్షేమానికే 'విశ్వకర్మ'



మాట్లాడుతున్న వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి

**ఖమ్మంవన్‌టౌన్‌:** కులవృత్తిదారుల సంక్షేమమే విశ్వకర్మ యోజన పథకం లక్ష్యమని జిల్లా పరిశ్రమ శాఖ మేనేజర్‌ అజయ్‌కుమార్‌ తెలిపారు. సంప్రదాయ కులవృత్తులను లాభదాయకంగా మార్చడం, తద్వారా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. కులవృత్తి, చేతివృత్తుల కళాకారులకు అవగాహన కల్పించేందుకు బుధవారం ఖమ్మంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్రంగి, కమ్మరి, మంగళి, రజక, వడ్డెర, కౌసలి, కంసాలి, దర్జీ తదితర వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆధార్‌ కార్డు, బ్యాంక్‌ పాస్‌బుక్‌, రేషన్‌ కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలతో సీఎస్సీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఆతర్వాత వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్దిదారులకు మొదటి విడతలో రూ.లక్ష రుణం మంజూరు చేసి నిర్ణీత వ్యవధిలో చెల్లించిన వారికి రూ.2లక్షల రుణం మంజూరవుతుందని తెలిపారు. అనంతరం బాలానగర్‌లోని మైక్రో, స్మాల్‌, మీడియం ఎంటర్‌ప్రైజెస్‌ డీఎఫ్‌ఓ శివకుమార్‌, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ కే.శివరామప్రసాద్‌ మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ నవీన్‌, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌ వెంగమ్మ, మున్సిపల్‌ అధికారి సుజాత పాల్గొన్నారు.

## డీసీఎంఎస్‌ చైర్మన్‌ కేసు నేటికి వాయిదా

**ఖమ్మంవ్యవసాయం:** డీసీఎంఎస్‌ చైర్మన్‌ రాయల వెంకట శేషగిరిరావుపై అనర్హత వేటు ఎత్తివేసిన వ్యవహారంపై వరంగల్‌లోని తెలంగాణ కో–ఆపరేటివ్‌ ట్రిబ్యునల్‌లో విచారణ గురువారానికి వాయిదా పడింది. చైర్మన్‌ డీసీసీబీ నుంచి కారు రుణం తీసుకుని సకాలంలో చెల్లించకపోవడంతో కారు సీజ్‌ చేశాక ఆయనను పదవి నుంచి తొలగించారు. దీంతో శేషగిరిరావు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో అనర్హత వేటు తొలగించి యథాతథంగా కొనసాగించాలని ఆదేశాలు అందాయి. ఈ విషయమై డీసీఓ బుధవారం ట్రిబ్యునల్‌కు హాజరుకాగా, విచారణను గురువారానికి వాయిదా వేశారు.

## బెళగావి రైలుకు గాంధీపురంలో హాల్టింగ్‌

**కారేపల్లి:** సికింద్రాబాద్‌ – భద్రాచలం రోడ్‌(కొత్తగూడెం) మార్గంలో నడుస్తున్న బెళగావి ఎక్స్‌ప్రెస్‌ రైలుకు కారేపల్లి మండలం గాంధీపురంలో హాల్టింగ్‌ ఇచ్చారు. ఈ రైలు 5వ తేదీ నుండి మొదలైంది. తొలుత గాంధీపురంలో హాల్టింగ్‌ ఇవ్వకపోవడంతో సామాజిక కార్యకర్త వేముల రాంమూర్తి రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం హాల్టింగ్‌ ఇవ్వాలని నిర్ణయించారు. సికింద్రాబాద్‌ నుంచి భద్రాచలం రోడ్‌ వెళ్లేటప్పుడు ఉదయం 9.44 గంటలకు, తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5గంటలకు ఈ రైలు గాంధీపురం చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

# రెండు కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్‌ పోలీసులు

**ఖమ్మంక్రైం:** జిల్లా కేంద్రంలో ఎక్సైజ్‌ అధికారులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్‌ చేశారు. ఈసందర్భంగా ఖమ్మం–1 ఎక్సైజ్‌ సీఐ కె.రాజు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం టేకులపల్లికి చెందిన ఉల్లి శరత్‌, ముస్తఫానగర్‌కు చెందిన సయ్యద్‌ ఫాయాజ్‌ అహ్మద్‌, కొదుమూరు నాగరాజు అలియాస్‌ రాజు రావణ్‌, బుర్హాన్‌పురానికి చెందిన షేక్‌ సోహైల్‌ అర్ఫత్‌, శ్రీనివాసనగర్‌కు చెందిన షేక్‌ సాదిక్‌ పాషా అలియాస్‌ చోటు ముఠాగా ఏర్పడి ఇతర రాష్ట్రాల నుంచి కేజీ రూ.5వేల చొప్పున గంజాయి తీసుకొస్తున్నారు. ఇక్కడ 50గ్రాములు, 100 గ్రాముల ప్యాకెట్లుగా చేసి ఖమ్మం నగరం, చుట్టుపక్కల విక్రయిస్తున్నట్లు తేలింది. ఈమేరకు నిందితులు జిల్లా కేంద్రంలోని బోనకల్‌ రోడ్డులో పట్టుబడగా, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు షేక్‌ రబ్బానీ, లత, ఉద్యోగులు రామారావు, లలిత, శశికాంత్‌, రమేష్‌, రవి, రమ, శిరీష, కవిత, నరేష్‌, మారేశ్వరవు పాల్గొన్నారు.

## దేవాలయాల భూముల నుంచి మట్టి తరలింపు


మట్టి తరలింపుపై వివరాలు సేకరిస్తున్న ఈఓ

**నేలకొండపల్లి:** దేవాదాయ శాఖకు చెందిన భూముల నుంచి కొందరు భారీ ఎత్తున టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 40 టిప్పర్ల మట్టి తరలించినట్లు తెలుస్తుండగా, స్థానికుల ఫిర్యాదుతో అధికారులు చేరుకుని వివరాలు సేకరించారు. మండలంలోని అమ్మగూడెంలో శ్రీ రాజరాజేశ్వరి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాలకు 42.17 ఎకరాల భూమి ఉంది. ఇక్కడి నుంచి బుధవారం రాత్రి కొందరు అక్రమంగా టిప్పర్లతో మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు దేవాదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ ఈఓ పి.నారాయణచార్యులు చేరుకునే లోగా టిప్పర్లతో అక్రమార్కులు వెళ్లిపోగా, జేసీబీ మాత్రం ఉంది. దీంతో ఈఓ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.




## మొబైల్‌ చాయ్‌ !

టీ తాగని వారు.. ఆ రుచి ఇష్టపడని వారు అతి తక్కువగా ఉంటారు. అందుకే వినియోగదారులను ఆకట్టుకునేందుకు వ్యాపారులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పెద్ద కంపెనీలు ప్రవేశించి జిల్లాలు, మండలాల వారీగా ఫ్రాంచైజీలు ఇస్తున్నారు. ఇక ఎక్కడ పడితే అక్కడ మొబైల్‌ టీ స్టాళ్లు ఏర్పాటవుతున్నాయి. ఈమేరకు పాత ఆటోలను మొబైల్‌ టీ స్టాళ్లుగా హైదరాబాద్‌లో సిద్ధం చేయించిన నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్తూ ఖమ్మంలో ఆగారు. ఖమ్మంలోని పటేల్‌ స్టేడియం వద్ద ఆపిన ఈ వాహనాలను పలువురు ఆసక్తిగా తిలకించారు. – స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌

## గంజాయి, గుడుంబాను నిర్మూలించాలి


సమీక్షలో మాట్లాడుతున్న ఈఎస్‌ నాగేందర్‌రెడ్డి

**ఖమ్మంక్రైం:** జిల్లాలో గంజాయి రవాణా, గుడుంబా తయారీ, అమ్మకాలను పూర్తిగా అరికట్టేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌(ఈఎస్‌) నాగేందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని ఎక్సైజ్‌ అధికారులతో బుధవారం ఆయన ఖమ్మంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ గుడుంబా, గంజాయి నిర్మూలనకు ప్రతిరోజు తనిఖీలు చేపట్టాలన్నారు. అలాగే, పెండింగ్‌ కేసుల సంఖ్య తగ్గించడంపై దృష్టి సారించాలని, శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఏఈఎస్‌ వేణుగోపాల్‌రెడ్డి, సీఐలు రాజు, రాజశేఖర్‌, జుల్ఫీకర్‌, రమ్య, పోశెట్టి, రాజిరెడ్డి, ప్రసాద్‌, విజేందర్‌ పాల్గొన్నారు.

## 'గృహజ్యోతి'కి గుర్తుగా మొక్కలు!


మొక్క నాటుతున్న యుగంధర్‌

**ఖమ్మంవ్యవసాయం:** రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్‌ వినియోగించే వారికి 'గృహజ్యోతి' పథకం ద్వారా ఉచితంగా సరఫరా చేయనున్నట్లు ప్రకటించింది. ఈ పథకంపై సర్వే ప్రారంభమైన నేపథ్యాన గుర్తుగా ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ ఆపరేటర్‌ వల్లాల యుగంధర్‌ బుధవారం మూడు మొక్కలు నాటారు. ఇప్పటికే సబ్‌స్టేషన్‌లో అనేక మొక్కలు నాటి సంరక్షిస్తున్న ఆయన 'గృహజ్యోతి'కి గుర్తుగా మునగ మొక్కలు నాటగా, పలువురు అభినందించారు.

## విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టిన కారు


కారు ఢీకొనడంతో విరిగిపోయిన స్తంభం

**సత్తుపల్లి:** అదుపుతప్పిన ఓ కారు విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోవడంతో అందులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన పాములూరి మనోజ్‌ గౌరిగూడెం నుంచి కాకర్లపల్లికి కారులో వస్తుండగా కిడ్స్‌కేర్‌ ఆస్పత్రి సమీపాన అదుపుతప్పి విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో స్తంభం విరిగిపోగా, కారు ముందు భాగం దెబ్బతింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాన్ని మార్చి విద్యుత్‌ సరఫరా పునరుద్ధరించారు. అయితే, ఘటనలో కారులోని వారికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**కారేపల్లి:** కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని సూర్యతండాకు చెందిన జర్పుల శాంతి బుధవారం కుటుంబంలో గొడవతో ఇంట్లోని పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

## గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

**ఖమ్మంక్రైం:** ఖమ్మంలోని మయూరి సెంటర్‌ బ్రిడ్జి వద్ద అనారోగ్యంతో మృతి చెందిన యాచకురాలి(70)ని బుధవారం స్థానికులు గుర్తించారు. ఈ ప్రాంతంలో కొన్నాళ్లుగా తిరుగుతున్న ఆమె మృతి చెందిన విషయాన్ని ఖమ్మం వన్‌టౌన్‌ పోలీసులకు తెలిపారు. దీంతో వారి సూచనల మేరకు అన్నం ఫౌండేషన్‌ చైర్మన్‌ శ్రీనివాసరావు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

## ముగ్గురిపై వ్యభిచారం కేసు నమోదు

**కల్లూరు:** కల్లూరులోని అంబేద్కర్‌నగర్‌లో ఇద్దరు యువతులతో ఓ గృహంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేశారు. వీఎం బంజర్‌కు చెందిన పవన్‌, రమేష్‌, వెంకటేశ్వరరావు ఇద్దరు యువతలను తీసుకొచ్చి వ్యభిచారం చేస్తుండగా తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# 6,100 పోస్టులతో డీఎస్సీ

- షెడ్యూల్ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- నేడు టెట్‌కు, 12న డీఎస్సీకి నోటిఫికేషన్ల జారీ

సాక్షి, అమరావతి: ఏపీలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)తో పాటు డీఎస్సీ–2024 నోటిఫికేషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల 12న ఇవ్వనుంది. టెట్, డీఎస్సీకి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://cse.ap.gov.in ద్వారా చేసుకోవాలి. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచే ఆయా పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, ఏప్రిల్ చివరి నాటికి అభ్యర్థులకు పోస్టింగ్ ఇస్తామని, వారు వచ్చే విద్యా సంవత్సరంలో బోధన కూడా చేపడతారని మంత్రి బొత్స తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 14,219 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షలు రెండింటినీ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఏపీ టెట్, డీఎస్సీ–2024 షెడ్యూల్..

| అంశం | టెట్ | డీఎస్సీ |
|---|---|---|
| నోటిఫికేషన్ | ఫిబ్రవరి 8 | 12 |
| ఫీజు చెల్లింపు | ఫిబ్రవరి 17 | 21 వరకు |
| దరఖాస్తు ప్రక్రియ | ఫిబ్రవరి 18 | 22 వరకు |
| ఆన్‌లైన్ నమూనా పరీక్ష | ఫిబ్రవరి 19 | 24 |
| హాల్‌టికెట్లు | ఫిబ్రవరి 23 నుంచి | మార్చి 5 నుంచి |
| పరీక్ష నిర్వహణ | ఫిబ్రవరి 27 నుంచి మార్చి15 | మార్చి 9 30 వరకు |
| ప్రాథమిక కీ | మార్చి 10 | 31 |
| తుది కీ | మార్చి 13 | ఏప్రిల్ 2 |
| ఫలితాల ప్రకటన | మార్చి 14 | ఏప్రిల్ 7 |



# ఏడు రంగుల ఆంధ్ర ధనుస్సు

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రూ.2.86 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటికి ప్రాధాన్యం

ద్రవ్య, రెవెన్యూ లోటు తగ్గించే చర్యలు

నాలుగు నెలలకు రూ.88,215 కోట్ల వ్యయానికి అసెంబ్లీకి ప్రతిపాదన




'రోటి, కపడా, ఔర్ మకాన్' ఎవరు అవునన్నా, కాదన్నా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇదో నినాదం. ప్రజలకు వీటిని సమకూర్చడం పాలకుల కనీస బాధ్యత. ఇవి అందుబాటులో ఉన్నప్పుడే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయడానికి ఉపక్రమిస్తుంది. వీటిని విస్మరించి, గ్రాఫిక్స్‌తో ఎన్ని మేడలు కట్టినా అవి నీటి మూటలేనని చరిత్ర చెబుతోంది. ప్రజల ఆనందాన్ని, వారి బాగోగులను చూసి ఆనందించే వాడే అసలైన పాలకుడని కూడా చరిత్ర వెల్లడిస్తోంది. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలిచినప్పుడే ప్రజా రంజక పాలన అనిపించుకుంటుంది. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో చేయూత అందిస్తే చాలు, ప్రజలు స్వయం సమృద్ధి దిశగా అడుగు లేస్తారని విశ్వ వ్యాప్తంగా విఖ్యాత ఆర్థిక నిపుణులు నొక్కి వక్కాణిస్తుండటం తరచూ వినిపిస్తోంది. ఈ మూడు రంగాల అభ్యున్నతికే ఎన్నో దేశాలు, రాష్ట్రాలు సతమతం అవుతున్న వేళ.. ఇంతకు మించిన సంక్షేమాభివృద్ధిని సాకారం చేస్తూ మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాల పథకాలు, సప్త స్వరాల్లాంటి థీమ్‌ల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన జీవనాన్ని అందించాలనే తపన, తాపత్రయం.. బడ్జెట్‌లో పెద్దపీట వేయడం ద్వారా కళ్లకు కడుతోంది.

రంగాల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో) ₹

| విద్య | గ్రామీణాభివృద్ధి | వ్యవసాయం, అనుబంధ రంగాలు | గృహ నిర్మాణాలు | బీసీ సంక్షేమం | ఎస్టీ సంక్షేమం |
|---|---|---|---|---|---|
| 33,898 | 17,816 | 14,236 | 7,062 | 29,001.31 | 4,133.73 |
| **వైద్య, ఆరోగ్యం** | **పట్టణాభివృద్ధి** | **సాగునీరు** | **సంక్షేమం** | **ఎస్సీ సంక్షేమం** | **మైనారిటీల సంక్షేమం** |
| 17,916 | 9,546 | 12,038 | 44,668 | 9,291.55 | 2,242.36 |

# సంక్షేమ శకం




**రూ.2,86,389.27 కోట్లతో బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్**

- మన రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు
- ఏడు ప్రధాన అంశాలతో సీఎం జగన్ వినూత్న పాలన
- గతంలో రెవెన్యూ వృద్ధి రేటు 6 శాతం.. ఇప్పుడు 16 శాతం

ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 14 నుంచి 4వ స్థానానికి ఎగబాకాం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్థికాభివృద్ధితో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పిందని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రానున్న కాలంలో రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. బుధవారం అసెంబ్లీలో రూ.2,86,389.27 కోట్లతో 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తనకు వరుసగా ఐదేళ్లుగా ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో అత్యంత బలహీనులకు ప్రాధాన్యం ఇవ్వడంలో దివంగత వైఎస్సార్ నిబద్ధత, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అసమానతలను రూపుమాపడం, వెనుకబడిన వర్గాలకు రక్షణ, సాధికారత, నాణ్యమైన విద్య, వైద్యం, పోషణ, జీవనోపాధి కల్పించటాన్ని నైతిక బాధ్యతగా భావిస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏడు అంశాలు సుపరిపాలిత ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమాంధ్ర, సంపన్న ఆంధ్రా, భూ భద్ర ఆంధ్ర పేరుతో సీఎం జగన్ చేపట్టిన కీలక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయంటూ రంగాల వారీగా ప్రగతిని వివరించారు. ఉదయం 11.04 గంటలకు ముహూర్తం ప్రకారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తన ప్రసంగంలో గాంధీజీ, అబ్రహాం లింకన్, కోఫీ అన్నన్, అమర్త్యసేన్, బీఆర్ అంబేడ్కర్, వివేకానందుడి సూక్తులను ఉటంకిస్తూ మధ్యాహ్నం 1.05 గంటల వరకు సుదీర్ఘంగా మాట్లాడారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శాసన మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

## ఐదేళ్లలో 'సుపరిపాలిత ఆంధ్ర'గా..

గడప గడపకు ప్రభుత్వ సేవల ద్వారా బాధ్యతాయుత పాలన

ఎటువంటి లోపాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సీఎం జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనా సంస్కరణలను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన

## వెలుగు జిలుగుల అన్నపూర్ణ ఆంధ్ర

ఈ 57 నెలల్లో పండుగలా మారిన వ్యవసాయ రంగం

- అడుగడుగునా అన్నదాతను చేయపట్టి నడిపించిన ప్రభుత్వం
- కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ అనుబంధ రంగాలు
- వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పెట్టుబడి సాయం

## ఇదిగో.. సామర్థ్య ఆంధ్ర!

సీఎం జగన్ పాలనలో అనతి కాలంలోనే సామర్థ్య ఆంధ్రగా ఆవిర్భావం

## మౌలిక వసతులతో... రాష్ట్రం సుసంపన్నం

మౌలిక సదుపాయాల కల్పనకు రూ.43,307.21 కోట్లు

**జిల్లా వార్తలు**

## కొనసాగుతున్న అంతర కళాశాల క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న బాలికల జట్టు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాల క్రీడా పోటీలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈసందర్భంగా క్రికెట్ పోటీల్లో జగిత్యాల - వరంగల్ జట్లు తలపడగా జగిత్యాల జట్టు గెలుపొందింది. అలాగే, వాలీబాల్ పోటీల్లో రాజేంద్రనగర్ బాలికల జట్టు, టెన్నికాయిట్, చదరంగం పోటీల్లో అశ్వారావుపేట కళాశాల జట్టు, టేబుల్ టెన్నిస్ పోటీల బాలుర విభాగంలో పోటీల్లో అశ్వారావుపేట జట్టు గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. ఇక బాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జగిత్యాల కళాశాల జట్టుపై అశ్వారావుపేట కళాశాల విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, శ్రావణ్‌కుమార్, మధుసూదన్‌రావు, రాంప్రసాద్, శిరీష, పావని, నీలిమ, సిబ్బంది పాల్గొన్నారు.

## డోర్నకల్–మిర్యాలగూడ అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

- పార్లమెంట్‌లో ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు, రైతులకు నష్టం కలిగించేలా ఉన్న డోర్నకల్–మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించి మార్చాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో బుధవారం ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ అలైన్‌మెంట్ పురోగతి, తన ప్రతిపాదనలపై ఆరా తీశారు. సారవంతమైన వ్యవసాయ భూములను కాపాడుకునేందుకు గాను రైతులు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతున్నారని, ప్రతిపాదిత మార్గంలో విలువైన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పేదల ఇళ్లు ఉన్నాయని తెలిపారు. దీంతో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బదులిస్తూ డోర్నకల్–మిర్యాలగూడ మధ్య కొత్త రైలు మార్గం కోసం సర్వే జరుగుతుండగా, పలు అంశాల ఆధారంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. పూర్తిస్థాయిలో డీపీఆర్ సిద్ధమయ్యాక తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# అన్నదాతకు అండగా..

**వరి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకం**

- మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
- ఎకరాకు అదనంగా రూ.12,500 ఆదాయం
- ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మందికి ప్రయోజనం



వరి పైరు (ఇన్‌సెట్) వరి పైరు నుంచి వస్తున్న ధాన్యం

ఖమ్మంవ్యవసాయం : అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వచ్చే వానాకాలం నుంచి వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించింది. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది రైతులు వరి సాగు చేస్తూ దేశంలోనే అగ్రభాగాన నిలిచారు. నీటి వనరులు మెరుగవడంతో ఈ పంట సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక రాష్ట్రంలో వరి పండించే జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు కూడా ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. ప్రధానంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఖమ్మం జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉంది. జిల్లాలోని 16 మండలాలకు సాగర్ నీరు అందుతోంది. దీంతో సాగర్ ఆయకట్టు ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఈ నీటి విడుదలతో జిల్లాలోని పలు ప్రాంతాల్లోని రిజర్వాయర్లు, జలాశయాలకు నీరు చేరి, ఆయా ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో వరిసాగు విస్తీర్ణం 2.80 లక్షల ఎకరాలుగా ఉంది. భద్రాద్రి జిల్లాలోనూ పలు ప్రాజెక్టులు, జలాశయాలు ఉండడంతో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

**2 లక్షల మంది రైతులకు లబ్ధి..**

రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న బోనస్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 2 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలుగనుంది. ఖమ్మం జిల్లాలో దాదాపు 1.24 లక్షల మంది, భద్రాద్రి జిల్లాలో 86 వేల మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. వీరి పండించే వరికి మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ రానుంది.

**ఉమ్మడి జిల్లాలో వరి సాగు, దిగుబడుల వివరాలు**

| ఖమ్మం జిల్లా | | భద్రాద్రి జిల్లా | |
|---|---|---|---|
| వరి సాగు విస్తీర్ణం | : 2,78,299 ఎకరాలు | వరి సాగు విస్తీర్ణం | : 1,56,274 ఎకరాలు |
| దిగుబడి అంచనా | : 69,57,475 క్వింటాళ్లు | దిగుబడి అంచనా | : 39,06,850 క్వింటాళ్లు |
| బోనస్ | : రూ. 347.87 కోట్లు | బోనస్ | : రూ.195.34 కోట్లు |
| లబ్ధి పొందే రైతుల సంఖ్య | : 1,24,242 | లబ్ధి పొందే రైతుల సంఖ్య | : 86,000 |

**మద్దతు ధరకు బోనస్ అదనం..**

ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యాన్ని గ్రేడ్–ఏ, కామన్ రకాలుగా విభజించి మద్దతు ధర ప్రకటిస్తుంది. ఈ ఏడాది గ్రేడ్–ఏ రకం క్వింటాకు రూ.2,203, కామన్ రకానికి రూ.2,183గా నిర్ణయించింది. ఈ ధరలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో గ్రేడ్–ఏ రకానికి రూ. 2,703, కామన్ రకానికి రూ. 2,683 చొప్పున వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతులకు దక్కే అవకాశం ఉంది. ఎకరాకు సరాసరి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటాకు రూ.500 చొప్పున 25 క్వింటాళ్లకు అదనంగా రూ.12,500 వరకు లబ్ధి చేకూరవచ్చని అంచనా.

**వరి రైతులకు ఊరట**



వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడం అన్నదాతలకు ఎంతో ఊరట. ఇతర పంటలతో పోలిస్తే వరి సాగు నుంచి ఆశించిన ఆదాయం రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ప్రకటిస్తున్నా పెరిగిన పెట్టుబడి ఖర్చులతో అంతగా ప్రయోజనం కలగడం లేదు. మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 500 బోనస్ ఇవ్వడం రైతులకు ప్రయోజకరం.

– చంద పుల్లారెడ్డి, ఈశ్వరమాధారం, కూసుమంచి మండలం

**బోనస్‌తో ఎంతో మేలు**



వరి ధాన్యానికి బోనస్ ఇవ్వడం ఎంతో మేలు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావటం ఆనందంగా ఉంది.

– తేజావత్ తారాచంద్, 9వ మైలుతండా, టేకులపల్లి మండలం

**పెట్టుబడులు కలిసొస్తాయి**



వరిసాగులో పెట్టుబడులు బా గా పెరిగాయి. అందుకు అనుగుణంగా ఆదాయం లేదు. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వటం పెట్టుబడులకు కొంత ప్రయోజనం కలుగుతుంది. ప్రతి ఏటా 3 ఎకరాల్లో వరి సాగు చేస్తా. దిగుబడులు వస్తున్నా.. ఆశించిన ధరలేక పెట్టుబడి మాత్రమే వస్తోంది. ఈ బోనస్ డబ్బు పెట్టుబడులకు ఉపయోగపడుతుంది.

– అజ్మీరా రాంజీ, మసివాగు తండా, ఇల్లెందు మండలం

**వరి సాగుకు ప్రోత్సాహకరం**



రాష్ట్ర ప్రభుత్వం అందించే బోనస్ వరి సాగు రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలు పంట దిగుబడులపై ప్రభావం చూపుతూ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వటం శుభ పరిణామం. వరి పండించే రైతులకు ఈ బోనస్ ప్రోత్సాహకరంగా ఉండే అవకాశం ఉంది.

– నాగండ్ల మోహన్‌రావు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

# 'పంట' పండింది!

- టమాటాలో అధిక దిగుబడి సాధిస్తున్న రైతు సీతయ్య
- ఎత్తుమడులు, డ్రిప్, మల్చింగ్, పందిరి పద్ధతిలో సాగు



సీతయ్య తోటలో టమాటాలు పరిశీలిస్తున్న అధికారులు

అశ్వాపురం: సంప్రదాయ విధానంలో కాకుండా అధునాతన పద్ధతులు పాటిస్తూ టమాటా సాగు చేసిన అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన రైతు గాదె సీతయ్య అధిక దిగుబడి సాధించి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన గత పదేళ్లుగా టమాటా సాగు చేస్తున్నప్పటికీ దిగుబడి ఉంటే మార్కెట్లో ధర లేక.. ధర ఉన్నప్పుడు దిగుబడి రాక ఇబ్బందులు పడ్డాడు. ఈ నేపథ్యాన ఆధునిక పద్ధతుల్లో సాగుకు శ్రీకారం చుట్టి ఇప్పుడు లాభాల బాట పట్టాడు. ఈ ఏడాది మూడెకరాల్లో టమాటా సాగుచేసిన సీతయ్య ఎత్తుమడులు, డ్రిప్, మల్చింగ్, పందిరి పద్ధతులు పాటించాడు. సేంద్రియ ఎరువులే వాడుతుండగా.. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి కాగా.. సుమారు 20 నుంచి 25 టన్నులు దిగుబడి వస్తోంది. తద్వారా ఎకరానికి రూ.3లక్షల నుంచి నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం రావడంతో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈమేరకు భద్రాద్రి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న తదితరులు సీతయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఎత్తుమడులు, డ్రిప్, మల్చింగ్, పందిరి పద్ధతిలో టమాటా సాగు చేస్తుండగా మంచి దిగుబడి వచ్చిందని తెలిపాడు. మార్కెట్లో ధర కూడా ఉండడంతో లాభాలు వస్తున్నాయని వెల్లడించాడు. ఇటీవల ఒకేరోజు తోట వద్దే 250 బాక్సుల టమాటా అమ్మానని, ఇప్పటివరకు 15 టన్నులు కోయగా ఇంకా దిగుబడి వచ్చే అవకాశముందని తెలిపాడు.

## శరవేగంగా అభివృద్ధి పనులు



స్టేషన్ ముఖద్వారంలో నిర్మాణాలు కూల్చివేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్ (కొత్తగూడెం)లో అమృత్ భారత్ పథకం కింద ఎంపిక కాగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈమేరకు బుధవారం స్టేషన్ ప్రధాన ముఖద్వారాన్ని కూల్చివేశారు. ఈ స్థానంలో మరింత ఆకట్టుకునే రీతిలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తికావడానికి ఎనిమిది నెలల సమయం పడుతుందని తెలియగా... ఆతర్వాత స్టేషన్ నూతన కళ సంతరించుకుంటుందని చెబుతున్నారు.

## మాతాశిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్: మాతా, శిశు మరణాలు తగ్గించడంపై అధికారులు, వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు తదితరులతో సమావేశమైన పీఓ మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా గర్భిణులకు స్కానింగ్ చేయకపోవడంపై కారణాలను ఆరా తీసిన ఆయన ప్రతీ గర్భిణీకి ఇక్కడే స్కానింగ్ చేయించాలని సూచించారు. పాలవంచ, ఇల్లెందు, భద్రాచలం, రామవరం ఎంసీహెచ్‌ల్లో నెలకు వందకు స్కానింగ్‌లు జరిగేలా చూడాలన్నారు. అలాగే, గొత్తికొయ, కొండరెడ్ల గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ మాతాశిశు మరణాలు తగ్గించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి విజేత, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ నాగేంద్రతో పాటు డాక్టర్ కపిల్‌శర్మ, ఉజ్వల్, భార్గవ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.